

నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని కలిసిన తుక్కాపూర్ గ్రామస్తులు

## బీఆర్ఎస్ పార్టీకే మా ఓటు

- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డితో తుక్కాపూర్ గ్రామస్తులు

కొల్చారం, నవంబర్ 3: బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఊర్లన్నీ ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నాయి. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామస్తులు ఆత్మ డైరెక్టర్ దొడ్ల ఆంజనేయిలు ఆధ్వర్యంలో శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో సునీతారెడ్డి స్వగృహానికి శుక్రవారం వెళ్లి సన్మానించారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ ఆదేశాలతో మదిర గ్రామమైన తుక్కాపూర్‌ను పంచాయతీగా ఏర్పాటు చేశారని, గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ భవనం మంజూరుతోపాటు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేయడంతో తామంతా ఆత్మ గౌరవంతో జీవిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. తామంతా బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేస్తామని తెలిపారు. సునీతారెడ్డిని కలిసిన వారిలో విద్యా కమిటీ చైర్మన్ గోపాల్, రాజప్ప, డి.శ్రీశైలం, కృష్ణ, చంద్రయ్య, సుధాకర్, సత్తెయ్య, నాగరాజు, షేకయ్య, హనుమంత్, నరహరి, మధు, రమేశ్, వీరేశం, యాదగిరి, మల్లయ్య తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, నవంబర్ 3: చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోరి పెంటయ్య భార్య బాలమణి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండి ముందుకు సాగాలని కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. ఆమె వెంట జడ్పీటీసీ పట్లోరి మాధవి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## 100 శాతం పోలింగ్ సాధించాలి

- మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్




మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 3: జిల్లాలో 100 శాతం పోలింగ్‌ను సాధించాలని మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా వినూత్న కార్యక్రమం విద్యార్థి హామీ పత్రం అన్నారు. యువ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మీ కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా ఈ నెల 30న ఓటేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర ముఖ్యం

- ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీమ్‌లు కలిసి పనిచేయాలి
- మెదక్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ (ఐఆర్ఎస్)

మెదక్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర చాలా గొప్పదని, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీమ్‌లు కలిసి పనిచేయాలని వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ (ఐఆర్ఎస్) అన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కేంద్ర ఎన్నిక సంఘం నియమించిన వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ ఐఆర్ఎస్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషాతో కలిసి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా గొప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని కోరారు. వివిధ టీమ్‌ల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మెదక్ నియోజకవర్గంలో 6 టీమ్‌లు, నర్సాపూర్ నియోజకవర్గంలో 6టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అనుమతితోనే ప్రచార సామగ్రి రవాణా చేయాలని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్తగా జీరో అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. అధికారులు ఏదైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థి ఎలాంటి ఖర్చు అయినా నమోదు చేయాలని, ప్రతి సంఘటనను వీడియో, కెమెరాలో రికార్డ్ చేయాలని తెలిపారు. సీజ్ చేసే ప్రతి వస్తువు సరైనదా లేదా అని సరిచూసుకోవాలని, సీజ్ అయినా వస్తువులను ఈసీఐ ధరలతో సరి చూడాలన్నారు. ఓటర్‌కు ఎలాంటి సమస్య రాకుండా చూడాలని, అధికారులు ఓటర్లతో ఎలాంటి వాదనలు చేయాకుడదన్నారు. వివిధ రకాల టీమ్‌లు అన్ని రోజు ప్రజా సమావేశాలను గమనించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, ఎన్నికల సిబ్బంది, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను పరిశీలించిన సంజయ్ కుమార్ , జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

### ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను పరిశీలించిన సంజయ్ కుమార్

ఎన్నికల నియమావళిలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు. జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పని తీరును పరిశీలించారు. సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్‌ల పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పని తీరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా వివరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరంలో గ్రీవెన్స్ నోడల్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, ఎల్‌డీఎం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని బ్యాంకు ఖాతాల సమాచారం, ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమైన వారి అకౌంట్ సమాచారం, వాటి వివరాలు, జీఎస్‌టీ అకౌంట్ల వివరాలు, ఇప్పటి వరకు సీజ్ అయిన డబ్బు, మద్యం, నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### వ్యయ పరిశీలకుడిగా సంజయ్‌కుమార్

మెదక్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2007 బ్యాచ్‌కు చెందిన సంజయ్ కుమార్ ఐఆర్ఎస్‌ను 34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం, 37-నర్సాపూర్ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడిగా నియమించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. వ్యయ పరిశీలకుల పర్యటన ఈ నెల 3 నుంచి 5 వరకు, ఆ తర్వాత 9 నుంచి 15వ తేదీ వరకు, రెండో పర్యటన ఎన్నికలు పూర్తయ్యే వరకు ఉంటుందన్నారు. వ్యయ పరిశీలకుడికి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి వ్యయ సంబంధిత విషయాలపై ఏదైనా ఫిర్యాదులు ఉంటే రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సంజయ్‌కుమార్‌ను కలవచ్చని తెలిపారు. లేదా 9177030321 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. వ్యయ పరిశీలకుడికి జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ కృష్ణమూర్తిని లైజన్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు.

# నేడు హోంశాఖ మంత్రి మహమూద్ అలీ రాక

- ముస్లిం మైనార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్న మంత్రి
- జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్

నర్సాపూర్, నవంబర్ 3: నర్సాపూర్‌లో శనివారం నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనార్టీ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ రానున్నట్లు జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ హాజరవుతున్న సమావేశానికి ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సీఎం కేసీఆర్ హయాంలో ముస్లిం మైనార్టీలు ఎంతగానో అభివృద్ధి చెందారన్నారు. ఈ ఎన్నికల్లో ముస్లింలు గడపగడపకూ వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయానికి పాటుపడాలని తెలిపారు. షాదీముబారక్ పథకంతో ఎంతో మంది ముస్లింలు లబ్ధిపొందారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల కోసం పట్టణంలో శ్మశాన వాటికకు ఐదెకరాల స్థలం కేటాయించారన్నారు. సీఎం కేసీఆర్ నిలబెట్టిన బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయానికి తోడ్పడతామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ యువ నాయకుడు వాకిటి శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హబీబ్‌ఖాన్, ఎంపీపీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ లాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్



తూప్రాన్ పట్టణంలోని 3వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న చైర్మన్ రాఘవేందర్ గౌడ్



తూప్రాన్ మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



ఇస్లాంపూర్‌లో ఓటరు భిక్షపతికి గడ్డం గీస్తూ ఓటుపే అభ్యర్థిస్తున్న ఎలక్షన్ రెడ్డి

## జోరందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

తూప్రాన్, నవంబర్ 3: తూప్రాన్ పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఇస్లాంపూర్, గుండ్రెడ్డిపల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.